


.. అప్రమత్తంగా ఉండాలి
సీజనల్ వ్యాధులపై ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్ఓ డాక్టర్ శిరీష సూచించారు.
8లో



విద్యుదుత్పత్తికి బ్రేక్..
రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో విద్యుత్‌కు డిమాండ్ తగ్గింది. ఈ క్రమంలో ఉత్పత్తిని తగ్గించారు.
10లో

గరిష్టం / కనిష్టం
27° / 25°

వాతావరణం
జిల్లాలో బుధవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రామాలయంలో సుదర్శన హోమం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో మంగళవారం చిత్తా నక్షత్రం సందర్భంగా సుదర్శన హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోప వీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. పునర్వసు నక్షత్రం సందర్భంగా పట్టాభిషేకం, అళ్వార్ తిరునక్షత్రోత్సవాల ప్రారంభం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారాన్ని పురస్కరించుకుని ఆంజనేయ స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఈఓ ఎల్. రమాదేవి, అర్చకులు పాల్గొన్నారు.

కలెక్టర్, పీఓను కలిసిన జెడ్పీ చైర్మన్



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కోరం కనకయ్య

చుంచుపల్లి: కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల, ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్‌ను జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్‌కు ఆయన అభినందనలు తెలిపారు. ఆ తర్వాత జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్ రావు కూడా కలెక్టర్‌ను కలిశారు.

స్వల్పంగా పెరుగుతున్న గోదావరి



గోదావరి ప్రవాహం ఇలా..

భద్రాచలంటౌన్: భద్రాచలం వద్ద గోదావరి ఉధృతి స్వల్పంగా పెరుగుతోంది. సోమవారం ఉదయం 36.5 అడుగులు ఉన్న నీటిమట్టం రాత్రి 8 గంటలకు 39 అడుగులకు చేరింది. తర్వాత నెమ్మదిగా పెరుగుతుండడంతో బుధవారం ఉదయం వరకు 42 అడుగులకు చేరే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఎగువ ప్రాజెక్టుల ఔట్‌ఫ్లోతో పాటు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న ఈ ఉధృతి పెరిగే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

రేపు 'నిధి ఆప్ కే నిఖత్'

ఖమ్మం సహకారనగర్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 27న నిధి ఆప్ కే నిఖత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఖమ్మం జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఎం.డీ.సలీం ఖాన్ తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని సంస్థల యజమాన్యాలు, ఉద్యోగులు, పెన్షనర్ల భవిష్య నిధి సంస్థ(ఈపీఎఫ్ఓ) ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో సమస్యలు వెల్లడించి పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా వాసులు కల్లూరులోని కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఆఫీస్ కార్యాలయంలో, భద్రాద్రి జిల్లా వాసులు పాల్వంచలోని మున్సిపల్ ఆఫీస్ కాంప్లెక్స్‌లో గురువారం ఉదయం 9–30నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు.

కేటీపీఎస్‌లో నిలిచిన ఉత్పత్తి, పునరుద్ధరణ

పాల్వంచ : కేటీపీఎస్ 5వ దశ కర్మాగారంలో విద్యుదుత్పత్తి నిలిచిపోయింది. 250 మెగావాట్ల సామర్థ్యం గల 9వ యూనిట్‌లో బాయిలర్ ట్యూబ్ లీకేజీని గుర్తించిన అధికారులు సోమవారం రాత్రి ఉత్పత్తిని నిలిపివేశారు. సీఈ ఎం.ప్రభాకర్‌రావు ఆధ్వర్యంలో యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు నిర్వహించి మంగళవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఉత్పత్తిని అందుబాటులోకి తీసుకొచ్చి రాష్ట్రగ్రిడ్‌కు అనుసంధానం చేశారు.

మీ ఎన్నిక చెల్లదు!



కోర్టు తీర్పు నేపథ్యంలో పాల్వంచలోని వనమా నివాసంలో చర్చిస్తున్న ఎమ్మెల్యే అనుచరులు

వనమా ఎమ్మెల్యే స్థానంపై హైకోర్టు సంచలన తీర్పు

- ఇక కొత్తగూడెం ఎమ్మెల్యేగా జలగం వెంకట్రావు
- ఎన్నికల అఫిడవిట్‌లో తప్పుడు సమాచార ఫలితం
- నాలుగేళ్లుగా కొనసాగిన విచారణ
- సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామన్న వనమా

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా రాజకీయ ముఖచిత్రంలో మునుపెన్నడూ లేని పరిణామాలు చోటు చేసుకున్నాయి. గత సాధారణ ఎన్నికల్లో కొత్తగూడెం అసెంబ్లీ స్థానం నుంచి గెలుపొందిన ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అనూహ్యంగా పదవి కోల్పోయారు. మరోవైపు వనమా గెలుపును సవాల్ చేస్తూ న్యాయస్థానాన్ని ఆశ్రయించిన జలగం వెంకట్రావు చివరి నిమిషంలో ఎమ్మెల్యే పదవి చేపట్టనున్నారు.

అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం !

2018లో జరిగిన అసెంబ్లీ సాధారణ ఎన్నికల్లో కొత్తగూడెం నియోజకవర్గం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే జలగం వెంకట్రావు బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేశారు. ఆయనకు ప్రత్యర్థిగా మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు కాంగ్రెస్ తరఫున బరిలో నిలిచారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా ఇరువురి మధ్య గెలుపు దోబూచులాడింది. చివరకు సిట్టింగ్ ఎమ్మెల్యే వెంకట్రావుపై వనమా వెంకటేశ్వరావు 4,139 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. అయితే నామినేషన్ దాఖలు సందర్భంగా ఎన్నికల కమిషన్‌కు సమర్పించిన అఫిడవిట్‌లో వనమా తప్పుడు సమాచారం అందించారంటూ 2019లో జలగం వెంకట్రావు హైకోర్టును ఆశ్రయించారు. గత నాలుగేళ్లుగా ఈ కేసు హైకోర్టు విచారణలో ఉంది.

ఈరోజు వాళ్లది కావొచ్చు..

'ఈరోజు వాళ్లది కావొచ్చు. కానీ రేపటి రోజు నాది. సుప్రీంకోర్టుకు వెళ్తాను. అక్కడ నా నిజాయితీ నిరూపించుకుంటా. కచ్చితంగా రాబోయే ఎన్నికల్లో పోటీ చేస్తాననే విశ్వాసం నాకుంది. నేను ప్రజలతో ఎన్నుకోబడిన వ్యక్తిని. దొంగ ఓట్లు, రిగ్గింగ్‌తో ఎమ్మెల్యే కాలేదు. కొత్తగూడెం ప్రజల మద్దతుతోనే ఎమ్మెల్యేగా ఎన్నికయ్యా. ఇదే సమయంలో గౌరవ న్యాయస్థానం ఇచ్చిన ఇచ్చిన తీర్పునకు కట్టుబడి ఉంటా. నా నిజాయితీని సుప్రీంకోర్టుకు వెళ్లి నిరూపించుకుంటా. రాజకీయ క్షేత్రంలో గెలుపోటములు సహజం. నా 40 ఏళ్ల రాజకీయ జీవితంలో గెలిచినా, ఓడినా ప్రజల్లోనే ఉన్నాను. కానీ గత ఎన్నికల్లో ఓడిపోయిన వ్యక్తి ప్రజల కష్టసుఖాల్లో తోడుగా ఉండకుండా నాలుగేళ్లుగా కోర్టుల చుట్టే తిరుగుతున్నాడు. ఎవరు, ఎలాంటివారో ప్రజలకు బాగా తెలుసు. నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించిన కేసీఆర్‌కు కృతజ్ఞతలు' అని వనమా వెంకటేశ్వరరావు వ్యాఖ్యానించారు. మరోవైపు వనమా మద్దతుదారులు ఆయన ఇంట్లో సమావేశమయ్యారు. కోర్టు తీర్పుపై ఎలా వ్యవహరించాలనే అంశంపై చర్చించారు. పార్టీ అధినేత కేసీఆర్ సూచనలకు అనుగుణంగా ముందుకు వెళ్తామన్నారు. ఏం జరిగినా తామంతా వనమా వెంటే ఉంటామని ప్రకటించారు.

సంబరాల్లో జలగం వర్గీయులు

కోర్టు తీర్పు వచ్చిన మరుక్షణమే జలగం వర్గీయులు కొత్తగూడెంలో సంబరాలు చేసుకున్నారు. ఎక్కడికక్కడ వీధుల్లోకి వచ్చి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సాయంత్రానికి కల్లా పట్టణంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. తీర్పునకు సంబంధించిన కాపీలను తీసుకోవాల్సి ఉండడంతో జలగం వెంకట్రావు హైదరాబాద్‌లోనే ఉండిపోయారు.

అనర్హత వేటు, జరిమానా..

ఈ కేసు విషయంలో అటు వనమా, ఇటు జలగం ఇద్దరూ తమ తరఫున వాదనలు వినిపించారు. సుదీర్ఘ కాలం విచారణ కొనసాగగా, ఎన్నికల అఫిడివిట్‌లో వనమా కొన్నిచోట్ల తప్పుడు సమాచారం ఇచ్చారని, మరికొన్ని చోట్ల ఇవ్వాల్సిన సమాచారాన్ని దాచిపెట్టారని రూఢీ అయింది. అన్ని అంశాలను క్రోడీకరించి న్యాయమూర్తి జి. సుధారాణి మంగళవారం తుదితీర్పు ప్రకటించారు. ఇందులో సిట్టింగ్ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావుపై అనర్హత వేటు వేశారు. ఇదే సమయంలో వనమా సమీప అభ్యర్థిగా ఉన్న జలగం వెంకట్రావును ఎమ్మెల్యేగా ప్రకటించారు. గత అసెంబ్లీ సాధారణ ఎన్నికల ఫలితాలు వెలువడిన తేది 2018 డిసెంబర్ 12 నుంచి జలగం వెంకట్రావును ఎమ్మెల్యేగా పరిగణిస్తున్నట్టు న్యాయస్థానం తన తీర్పులో తెలిపింది. తప్పుడు సమాచారం ఇచ్చిన వనమా వెంకటేశ్వరరావుకు రూ.ఐదు లక్షల జరిమానా విధించింది.

కలసిరాని మంత్రి పదవి

- మంత్రిగా పోటీ చేసి ఓటమి పాలైన వనమా
- తర్వాత ఎన్నికల్లో టికెట్ దక్కని తీరు
- పార్టీలు మారినా కనిపించని ఫాయిదా
- ఎమ్మెల్యేగా గెలిచినా తప్పని తలనొప్పులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: వనమా వెంకటేశ్వరరావు 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు అందించారు. ఆయన జీవితాన్ని నిశితంగా పరిశీలిస్తే మంత్రి పదవి రాక ముందు.. వచ్చిన తర్వాత అన్నట్టుగా స్పష్టమైన విభజన రేఖ గీయొచ్చు.

ప్రజల మధ్యే ఉంటూ..

పాల్వంచ పారిశ్రామికంగా ఎదుగుతున్న తరుణంలో వార్డు సభ్యుడిగా వనమా రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. ఉదయం నుంచి రాత్రి వరకూ ప్రజల్లోనే ఉండేవారు. ప్రతిరోజూ ద్విచక్ర వాహనంపై పంచాయతీ పరిధిలో అన్ని వార్డులు, గ్రామాలకు వెళ్లి వచ్చేవారు. ఆ తర్వాత సర్పంచ్‌గా ఎన్నికైన వనమా చేస్తున్న కృషిని అప్పటి కలెక్టర్లు ఈమని పార్థసారధి, పీవీఆర్‌కే ప్రసాద్ మెచ్చుకున్నారు. ఆ రోజుల్లోనే మూడుసార్లు ఉత్తమ సర్పంచ్‌గా నాటి గ్రామీణాభివృద్ధి శాఖమంత్రి పరకాల శేషాచలం చేతులమీదుగా బంగారుపతకాలను అందుకున్నారు. ఆ తర్వాత అప్పటి సీఎం జలగం వెంగళరావు ప్రోత్సాహంతో చిన్న వయసులోనే భూ తనఖా (ల్యాండ్ మార్టిగేజ్) బ్యాంక్‌కు చైర్మన్‌గా ఎన్నికై ప్రతిభ చూపారు. 1989లో కొత్తగూడెం ఎమ్మెల్యే అభ్యర్థిగా కాంగ్రెస్ తరఫున పోటీ చేసి గెలుపొందారు.

రికార్డుస్థాయిలో ఇళ్ల మంజూరు..

పీవీ నరసింహారావు ప్రధానిగా ఉన్నప్పుడు రికార్డు స్థాయిలో కొత్తగూడెం నియోజకవర్గానికే 18 వేల ఇళ్లు మంజూరు చేయించి రికార్డు సృష్టించారు. ఇది చూసి అప్పటి సీఎం నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి సైతం ఆశ్చర్యపోయారు. ఆ తర్వాత 1999, 2004లో ఎమ్మెల్యేగా గెలిచి వైఎస్సార్ మంత్రి వర్గంలో వైద్య విధాన పరిషత్ మంత్రిగా పని చేశారు. పాల్వంచ ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేశారు. నియోజకవర్గ ప్రజల తలలో నాలుకగా ఉంటూ వచ్చారు.

మంత్రిగా పోటీ చేసి ఓటమి..

2009 అసెంబ్లీ ఎన్నికల్లో మంత్రి హోదాలో పోటీ చేసిన వనమా ఓడిపోయారు. ఆ రోజుల్లో ప్రతిపక్ష పార్టీలన్నీ కలిసి మహాకూటమిగా పోటీ చేయగా సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు చేతిలో వనమా ఓటమిపాలయ్యారు. ఆ తర్వాత 2014 ఎన్నికల్లో వనమాకు టికెట్ ఇచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ నిరాకరించింది. దీంతో ఆయన వైఎస్సార్ కాంగ్రెస్ తరఫున పోటీ చేసి మరోసారి ఓడిపోయారు. వరుసగా రెండు ఓటముల తర్వాత చావోరేవో తేల్చుకోవాల్సిన తరుణంలో 2018లో ఇవే తనకు చివరి ఎన్నికలంటూ హస్తం గుర్తుపై పోటీ చేసి గెలుపొందారు. కానీ కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలోనే ఉండడంతో నియోజకవర్గ అభివృద్ధి కోసం గులాబీ కండువా కప్పుకున్నారు. ఆ తర్వాత కొంత కాలానికే కరోనా కారణంగా ప్రజల్లో ఎక్కువగా తిరగలేకపోయారు. ఆ వెంటనే వనమా కుమారుడు రాఘవపై పోలీస్ కేసులు నమోదు కావడం ఆయనకు ఇబ్బందులు తెచ్చింది. ఇటీవల కాలంలో కొత్తగూడెం టికెట్ కోసం గులాబీ పార్టీలోనే ఆశావహుల నుంచి పోటీ ఎక్కువైంది. తీవ్రమైన పోటీని తట్టుకుంటూ మరోసారి కొత్తగూడెం నుంచి కారు గుర్తుపై పోటీ చేసేది తానేనంటూ వనమా ధీమా ప్రకటించారు. ఈ తరుణంలో అనూహ్యంగా అనర్హత వేటుకు గురయ్యారు.

నేడు కొత్తగూడేనికి డీఆర్ఎం

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలోని భద్రాచలం రోడ్డు(కొత్తగూడెం) రైల్వే స్టేషన్‌కు బుధవారం దక్షిణ మధ్య రైల్వే డివిజనల్ మేనేజర్ (డీఆర్ఎం) భర్తేష్‌కుమార్ జైన్ రానున్నారు. ఈ మేరకు ఆయన ప్రత్యేక రైలులో కొత్తగూడెం వస్తారు. ఇక్కడి స్టేషన్‌లో తనిఖీల అనంతరం మణుగూరు స్టేషన్, పాల్వంచ కేటీపీఎస్ తదితర ఏరియాల్లో తనిఖీలు నిర్వహిస్తారని అధికారులు వెల్లడించారు.

వినూత్నంగా 'తొలిమెట్టు'

కొత్తగూడెంఅర్బన్: ప్రాథమిక పాఠశాల విద్యార్థుల్లో కనీస భాషా, గణిత సామర్థ్యాల సాధనకు నిర్దేశించిన తొలిమెట్టు కార్యక్రమం ఈ విద్యా సంవత్సరం నుంచి వినూత్నంగా ఉంటుందని విద్యాశాఖ అకడమిక్ మానిటరింగ్ అధికారి ఎ.నాగరాజశేఖర్ తెలిపారు. కొత్తగూడెంలో మంగళవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే జిల్లా స్థాయిలో ఉపాధ్యాయులకు శిక్షణ ప్రారంభమైందని, ఆ తర్వాత మండలస్థాయి ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చి కార్యక్రమాన్ని అమలు చేస్తామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలతో పాటు తెలుగు, ఇంగ్లిష్, గణితం వర్క్ బుక్‌లు అందజేశామని చెప్పారు. ఉపాధ్యాయులకు పీరియడ్ ప్రణాళికలు అందజేస్తామని, వారంలో ఐదు రోజులు బోధన, ఒక రోజు మూల్యాంకనానికి వినియోగించాలని అన్నారు. కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్ బి.జుంకీలాల్, జిల్లా కోఆర్డినేటర్లు సైదులు, సతీష్, అన్నామణి పాల్గొన్నారు.

వనమా X జలగం





- నిబంధనల మేరకు అఫిడవిట్‌లో ఆస్తులు చూపని వనమా
- హిందూ అవిభక్త కుటుంబంగా ఉంటూ మైనార్టీ కాలేజీలు
- క్రిమినల్ కేసుల్లో గోప్యత
- వెంకటేశ్వరరావుకు ప్రతికూలంగా మారిన అంశాలివే..

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఆస్తులు, అప్పుల విషయంలో పక్కాగా లేకపోతే చిక్కులు తప్పవు అనేందుకు వనమా వెంకటేశ్వరరావు ఉదంతమే చక్కని ఉదాహరణగా నిలుస్తోంది. 2018 ఎన్నికల సందర్భంగా ఆయన అఫిడవిట్‌లో ఫామ్– 26లో వాస్తవ సమాచారం పొందుపరచలేదు. దీంతో పాటు ప్రభుత్వానికి ఉన్న బకాయిలను కూడా సరిగా చెల్లించలేదనే అభియోగాలపై హైకోర్టులో కేసు నమోదైంది. ఎన్నికల సందర్భంగా ఓటర్లతో పారదర్శకంగా వ్యవహరించే విషయంలోనూ వనమా నిబంధనలు ఉల్లంఘించారనే అంశాన్ని కూడా ఇందులో చేర్చారు. వీటిపై నాలుగేళ్ల విచారణ జరిగింది. ఎన్నికల కమిషన్ నిబంధనలు, ప్రజా ప్రాతినిధ్య చట్టం(ది రిప్రజెంటేషన్ ఆఫ్ ద పీపుల్ యాక్ట్) 1951 తదితర చట్టాల్లోని అంశాల ఆధారంగా మంగళవారం తీర్పు వెల్లడైంది. నిబంధనల ప్రకారం తీర్పు అమల్లోకి వచ్చిన తర్వాత కొత్తగూడెం నుంచి మరో ఆరేళ్ల పాటు ఎన్నికల్లో పోటీ చేయడానికి వనమా అనర్హుడుగా ఉంటారు. అయితే ఈ తీర్పుపై వనమా సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నారు.

క్రిమినల్ కేసుల విషయంలో..

వనమా వెంకటేశ్వరరావుపై 2017లో పాల్వంచ రూరల్, 2014లో కొత్తగూడెం టూ టౌన్ స్టేషన్లలో రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదు అయ్యాయి. న్యాయమూర్తుల ఎదుట కూడా హాజరుపరిచారు. అయితే ఈ రెండు కేసుల వివరాలను వనమా తన ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొనలేదు. అంతేకాదు.. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం పోటీ చేసే అభ్యర్థి తనపై ఉన్న క్రిమినల్ కేసుల వివరాలను ప్రముఖ వార్తా పత్రికలు, న్యూస్ చానళ్ల ద్వారా బహిర్గత పర్చాల్సి ఉన్నా ఇవేమీ చేయకుండా ఎన్నికల కమిషన్ నిబంధనలను ఉల్లంఘించారు. రాజ్యాంగ స్ఫూర్తికి, ప్రజా ప్రాతినిధ్య చట్టం –1951లో పొందుపరిచిన అంశాలకు వ్యతిరేకంగా వ్యవహరించారు.

ఆదాయానికి సంబంధించి..

వనమా వెంకటేశ్వరరావు పేరిట రెండు పాన్ కార్డులు ఉన్నాయి. ఇందులో ఒకటి వ్యక్తిగతమైనది కాగా, మరొకటి హిందూ అవిభక్త కుటుంబ వ్యాపారానికి సంబంధించినది. వీటి ద్వారానే వనమాకు కుటుంబ పరంగా ఆదాయం వస్తుండగా, ఆదాయ పన్ను కూడా చెల్లిస్తున్నారు. వనమా కుటుంబానికి ఏలూరు, చీరాలలో రెండు ఇంజనీరింగ్ కాలేజీలు ఉన్నాయి. ఈ కాలేజీలు ఆయన కుమారులకు చెందినవిగా పేర్కొన్నారు. అయితే ఈ రెండు కాలేజీలు క్రిస్టియన్ మైనార్టీ కాలేజీలుగా గుర్తింపు పొంది ఉన్నాయి. ఓవైపు హిందూ అవిభక్త కుటుంబంగా పేర్కొంటూ, మరోవైపు క్రిస్టియన్ మైనార్టీ కాలేజీలు కలిగి ఉన్నారు. వాస్తవ అంశాలను కాకుండా అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం ఇచ్చారు.

అఫిడవిట్‌లో చూపని ఆస్తులు

కొత్తగూడెం మున్సిపల్ పరిధిలో వనమా కుటుంబానికున్న కమర్షియల్ భవనం, అందులో వాటాకు సంబంధించిన అంశాలు అఫిడవిట్‌లో పొందుపర్చలేదు. పాల్వంచలోని ఇందిరానగర్ కాలనీలో 2–2–208 డోర్ నంబర్‌తో 300 గజాల విస్తీర్ణంలో ఉన్న ఇంటిని 2004, 2009, 2014 ఎన్నికల అఫిడవిట్లలో తన కుటుంబ ఆస్తిగా పేర్కొన్నారు. కానీ 2018 ఎన్నికల అఫిడవిట్‌లో ఈ ఆస్తిని చూపించలేదు. కానీ రెవెన్యూ రికార్డుల్లో ఈ ఇంట్లో 150 గజాలు వనమా కుటుంబ సభ్యులు వేరొకరికి అమ్మినట్టు ఉంది. ఈ వివరాలూ పేర్కొనలేదు. సర్వే నంబర్ 992/2లో వనమా కుటుంబానికి చెందిన 8.37 ఎకరాల స్థలంతో పాటు మరికొన్నింటిని కూడా అఫిడవిట్‌లో చూపలేదనే అభియోగాలు నమోదయ్యాయి.

బకాయిలు, ఇతరాలు

- వనమా వెంకటేశ్వరరావు సతీమణి పద్మావతికి చెందిన ఇన్నోవా వాహనంపై రూ.135 ట్రాఫిక్ చలాన్ పెండింగ్‌లో ఉంది. హైదరాబాద్‌లోని చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ చలాన్ విధించారు. దీన్ని చెల్లించలేదు.
- వనమా కుటుంబం పాల్వంచ మున్సిపాలిటీకి రూ.3,120 నీటి పన్ను బకాయి పడింది.
- పాల్వంచ పరిధిలోని సర్వే నంబర్ 10 /బావి కొయ్య దగ్గర 13 గుంటల భూమి ఉన్నట్టు పేర్కొన్నారు. దీన్ని నివాస యోగ్యమైన స్థలంగా చూపినా.. ధరణి పోర్టల్‌లో మాత్రం సదరు స్థల విస్తీర్ణం 18 గుంటలుగా ఉండి వ్యవసాయ భూమిగా చూపిస్తోంది.
- సంస్థాన్ పాల్వంచ పరిధిలోని ఉన్న భూములకు సంబంధించి అఫిడవిట్‌లో పొంతన లేని అంశాలు తెలిపారు.

నామినేషన్ దాఖలు చేసింది :	2018 నవంబర్ 14
పోలింగ్ జరిగిన తేది :	2018 డిసెంబర్ 07
ఫలితాలు వచ్చిన తేది :	2018 డిసెంబర్ 11
వనమా వెంకటేశ్వరరావుకు పడిన ఓట్లు :	81,118
జలగం వెంకట్రావుకు వచ్చిన ఓట్లు :	76,718
మెజార్టీ :	4,139 ఓట్లు

పెండింగ్ దరఖాస్తులు అప్‌లోడ్ చేయాలి

కలెక్టర్ ప్రియాంక ఆల



వీసీలో కలెక్టర్ ప్రియాంక, అధికారులు

కొత్తగూడెంఅర్బన్: పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను బుధవారం నాటికి ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ ప్రియాంక ఆల రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ హైదరాబాద్ నుంచి మంగళవారం వీసీ నిర్వహించగా, కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో నూతన ఓటర్ల నమోదుకు 16,099 దరఖాస్తులు రాగా, 14,749 విచారణ పూర్తయ్యాయని, 350 పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. మరణించిన ఓటర్లకు సంబంధించి 3,826 దరఖాస్తుల విచారణ పూర్తి కాగా 448 పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీఓలు స్వర్ణలత, రత్నకళ్యాణి, ఎస్‌డీసీ శివాజి పాల్గొన్నారు.

వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి..

జిల్లాలో మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించిందని, ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ, మండల, జిల్లా స్థాయి అధికారులు కార్యస్థానాల్లోనే ఉండాలని ఆదేశించారు. పొంగి ప్రవహిస్తున్న వాగులు దాటొద్దని ప్రజలకు సూచించారు. జలాశయాల వీక్షణకు ఎవరినీ అనుమతించొద్దని అధికారులకు సూచించారు. రహదారుల పైకి నీరు చేరిన ప్రాంతాల్లో రవాణా సేవలు నిలిపి వేయాలన్నారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లు కూలే ప్రమాదం ఉందని, అలాంటి వారిని గుర్తించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని చెప్పారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని చెప్పారు.

జలగం రూటే సపరేటు !

- రాజకీయ ప్రసంగాలకు దూరం
- చట్టాలు, పాలనా వ్యవహారాలపై సమగ్ర అవగాహన
- మ్యాజిక్‌ను మించి లాజిక్‌ను నమ్మే తత్వం
- మరోసారి హాట్ టాపిక్‌గా వెంకట్రావు



సుజాతనగర్‌లో జలగం వర్గీయుల ర్యాలీ

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఉమ్మడి ఖమ్మం జిల్లా రాజకీయాల్లో జలగం కుటుంబానిది ప్రత్యేక స్థానం. ముఖ్యమంత్రిగా, కేంద్రమంత్రిగా ఉమ్మడి జిల్లాలో పారిశ్రామిక రంగం పురోగతికి వెంగళరావు ఎంతో కృషి చేశారు. ఆయన వారసుడిగా జలగం వెంకట్రావు రాజకీయాల్లో ప్రవేశించారు. సమకాలీన నాయకులతో పోల్చితే వెంకట్రావు వ్యవహార శైలి భిన్నంగా ఉంటుంది. మాటలు తక్కువ.. చేతలు ఎక్కువ అన్నట్టుగా ఉంటారాయన.

ఎప్పుడూ ప్రశాంతంగానే..

ఎమ్మెల్యే పదవిలో ఉన్నా, ఓడిపోయినా వెంకట్రావు ఎప్పుడూ ప్రశాంతంగానే కనిపిస్తారు. ఆవేశపూరిత ప్రసంగాలకు దూరంగా ఉంటారు. ప్రత్యర్థులు తనపై చేసే విమర్శలకు సైతం పెద్దగా స్పందించరు. ప్రజాస్వామ్యంలో అది వారి హక్కు అన్నట్టుగా ఉంటారు. అవసరమైతే తప్ప ప్రజలతో కలిసేందుకు కూడా సుముఖంగా ఉండరు. అనవసరంగా షో చేయడం ఎందుకని అనుచరులతో అంటుంటారు. ఎమ్మెల్యేగా ఓడిపోయిన తర్వాత క్యాంప్ ఆఫీసు కేంద్రంగా రాజకీయ వ్యూహాలు రచించిన సందర్భాలు తక్కువే. అయినా తనకంటూ ప్రత్యేక వర్గాన్ని వెంకట్రావు కొత్తగూడెంలో ఏర్పాటు చేసుకోగలిగారు. మాటలు తక్కువైనా పని చేయడంలో దిట్ట అనే నమ్మకాన్ని కల్పించారు. అందుకే జలగం ఉన్నా లేకున్నా ఆయన కోసం పని చేసే కార్యకర్తలను తయారు చేసుకోగలిగారు.

ఎమ్మెల్యేగా ఎన్నో అభివృద్ధి పనులు..

ఎమ్మెల్యేగా ఉన్న ఐదేళ్ల కాలంలోనే కొత్తగూడెం భవిష్యత్ కోసం సరికొత్త ప్రణాళికను సిద్ధం చేశారు. సింగరేణి బొగ్గు గనులు తగ్గుతున్న తరుణంలో 'గూడెం' ప్రాభవం తగ్గకుండా పనులు చేశారు. పోలీస్ బెటాలియన్, ఏకలవ్య పాఠశాల, ఇంగ్లిష్ మీడియం స్కూల్, అక్షయపాత్ర భోజనం, మైక్రోసాఫ్ట్‌తో విద్యార్థులకు ట్యాబులు వంటి వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. జిల్లాను టూరిజం హబ్‌గా చేసేందుకు సెంట్రల్ పార్క్, హరిత హోటల్, కిన్నెరసాని రిసార్ట్స్, కిన్నెరసాని హౌజ్‌బోట్ థీమ్‌లను తెర మీదకు తెచ్చారు. ఎయిర్‌పోర్టు విషయంలో కదలిక తెచ్చేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేశారు. అంతేకాదు మూత పడిన స్పాంజ్ ఐరన్ కర్మాగారం రేపో మాపో పునఃప్రారంభం అవుతుంది అన్నంతగా పని చేశారు. వరంగల్, ఖమ్మం వంటి నగరాలకు దీటుగా కొత్తగూడెంలో పార్కింగ్, కమర్షియల్ కాంప్లెక్స్‌ల నిర్మాణం కోసం ప్రణాళికలు సిద్ధం చేశారు.

పక్కా ప్రణాళికతో..

ఏ అంశాన్ని చేపట్టినా లోతుల్లోకి వెళ్లి అధ్యయనం చేయడం, ఆ తర్వాత కార్యాచరణ రూపొందించుకోవడం వెంకట్రావుకు వెన్నతోపెట్టిన విద్య. దీన్ని అన్ని విషయాల్లోనూ అమలు చేస్తుంటారు. ఎన్నికల అఫిడవిట్‌లో తెలిపిన అంశాలను మిగిలిన రాజకీయ నాయకులు చూసీ చూడనట్టుగా వదిలేస్తారు. కానీ జలగం అలా కాకుండా అందులోని అంశాలన్నీ పరిశీలించారు. చివరకు నీటి బిల్లు, ట్రాఫిక్ చలాన్ వంటి అంశాలనూ పక్కాగా పొందు పరిచి కేసు ఫైల్ చేశారు. చివరకు అనుకున్న ఫలితం సాధించారు.

క్లుప్తంగా

పోలీస్ స్టేషన్ ఆవరణలో చదును చేసిన సీఐ


చదును చేస్తున్న సీఐ వినయ్‌కుమార్

పాల్వంచరూరల్: ఓ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ట్రాక్టర్‌తో పోలీస్ స్టేషన్ ప్రాంగణాన్ని చదును చేసిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. మండలంలోని కిన్నెరసానిలో నూతనంగా నిర్మించిన పోలీస్ స్టేషన్‌ను ఈ నెల 27న ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం పాల్వంచ సీఐ వినయ్‌కుమార్ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం సీఐ స్వయంగా ట్రాక్టర్‌తో ఎత్తు పల్లాలు లేకుండా చదును చేశారు.

టేబుల్ టెన్నిస్‌లో జిల్లా క్రీడాకారుల హవా


విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న దృశ్యం

కొత్తగూడెంటౌన్: జిల్లాకు చెందిన క్రీడాకారులు టేబుల్ టెన్నిస్‌లో సత్తా చాటారని సీనియర్ క్రీడాకారుడు బట్టు ప్రేమ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24, 25 తేదీల్లో కరీంనగర్ జీఎస్ టేబుల్ టెన్నిస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో కొత్తగూడెంనకు చెందిన లోకేశ్ ప్రతిభ చూపి ప్రథమస్థానం సాధించాడని పేర్కొన్నారు. జాతీయస్థాయి పురుషుల డబుల్స్ విభాగంలో కొత్తగూడెంనకు చెందిన వెటరన్ క్రీడాకారులు రియాజ్ షేక్, లోకేశ్ జంట ద్వితీయ స్థానం సాధించారని వెల్లడించారు.

వాగు దాటి వైద్యసేవలు


వాగు దాటుతున్న వైద్య సిబ్బంది

చర్ల: మండలంలోని కొయ్యూరు ప్రభుత్వ వైద్యశాల సిబ్బంది మంగళవారం వాగులు దాటి పలు గ్రామాలకు వెళ్లి వైద్యశిబిరాలు నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీధర్ నేతృత్వంలో డాక్టర్ ఆశ, సీహెచ్‌ఓ రామలక్ష్మి, హెచ్‌ఈఓ వేణుగోపాలకృష్ణ, సూపర్‌వైజర్లు పుష్పావతి, డీపీఎంఓ ముత్యాల్‌రావు క్రాంతిపురం, దండుపేట, కొత్తపల్లి గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

నిర్లక్ష్యంగా వాహనాలు నడిపితే చర్యలు

ఎస్పీ డాక్టర్ వినీత్

కొత్తగూడెంటౌన్: నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ డాక్టర్ వినీత్ హెచ్చరించారు. 2014 జూన్ 5న కారుకొండ రామవరం గ్రామానికి చెందిన కాకటి సీతారాములు బైక్‌పై వెళుతుండగా లారీ ఢీకొని మృతిచెందాడు. దీనిపై మృతుడి భార్య సరోజిని ఫిర్యాదు మేరకు కర్ణాటకలోని బీదర్ జిల్లాకు చెందిన లారీ డ్రైవర్ మస్తాన్‌రావుపై కొత్తగూడెం వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం నిందితుడికి ఆరు నెలల జైలుశిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ కొత్తగూడెం మొదటి అడిషనల్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ ఎ.సుచరిత తీర్పు చెప్పారు. ఈ సందర్భంగా ప్రాసిక్యూటర్ విశ్వశాంతి, కోర్టు డ్యూటీ ఆఫీసర్ నర్సింహారావును ఎస్పీ అభినందించి మాట్లాడారు. మద్యం సేవించి వాహనాలు నడిపినా, అతివేగంగా నడుపుతూ ప్రజలకు ఇబ్బంది కలిగించినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి


మాట్లాడుతున్న సీఐ కరుణాకర్

కొత్తగూడెంటౌన్: ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని కొత్తగూడెం వన్‌టౌన్ సీఐ ఎం.కరుణాకర్ అన్నారు. బుధవారం పట్టణ పరిధిలోని రామాటాకీస్ ఏరియాలోని ఒక పాఠశాలలో వన్‌టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన నిర్వహించగా సీఐ హాజరై ప్రసంగించారు. తమకు తెలియకుండానే సైబర్ నేరాల బారిన పడుతున్నారని, సెల్‌కు వచ్చే ప్రతి మేసేజ్‌ను క్షుణ్ణంగా పరిశీలించాలని, అనుమానిత కాల్స్‌ను లిఫ్ట్ చేయొద్దని చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నర్సిరెడ్డి, కానిస్టేబుళ్లు, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,623

జలగం అభిమానుల సంబురాలు


చుంచుపల్లి: రామాంజనేయకాలనీలో మిఠాయి తినిపించుకుంటున్న జలగం వర్గీయులు

చుంచుపల్లి: కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావుపై అనర్హత వేటు వేయడంతోపాటు మంగళవారం హైకోర్టు మాజీ ఎమ్మెల్యే జలగం వెంకటరావుకు అనుకూలంగా తీర్పు వెలువరించిన నేపథ్యంలో ఆయన అభిమానులు సంబురాలు జరుపుకున్నారు. చుంచుపల్లి మండలంలో విద్యానగర్, త్రీఇంక్‌లైన్, రుద్రంపూర్, గౌతంపూర్ ప్రాంతాల్లో బాణసంచా కాల్చి సందడి చేశారు. కార్యక్రమంలో పానకంటి రాజు, ఉపసర్పంచ్ స్రవంతి, అనిల్, అంకుష్, ఆసిస్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు. రామాంజనేయకాలనీలో నిర్వహించిన సంబురాల్లో బండి భాస్కర్, నాని, రాము, బషీర్, షరీఫ్, రాజు, వాసు తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెంలో..

కొత్తగూడెంఅర్బన్: ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ఎన్నిక చెల్లదంటూ హైకోర్టు తీర్పు చెప్పడంతో కొత్తగూడెంలో జలగం వెంకట్రావు అభిమానులు సంబురాలు చేశారు. రాజేశ్, దిలీప్, మోహన్, రేవంత్, సలీం, సంజయ్, భద్రం తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచలో..

పాల్వంచ: ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ఎన్నిక చెల్లదంటూ హైకోర్టు తీర్పు చెప్పడంతో మంగళవారం జలగం వెంకటరావు వర్గీయులు సంబురాలు జరిపారు. మంజూరు, చందునాయక్, శ్రీపాద సత్యనారాయణ, సైదులు, బొల్లం భాస్కర్, హాఫీజ్, సమ్మయ్య, వాసుమల్ల సుందర్‌రావు, సూరిబాబు, రవీందర్, శ్రీను, సీతారామయ్య పాల్గొన్నారు.

సుజాతనగర్‌లో..

సుజాతనగర్: హైకోర్టు తీర్పు నేపథ్యంలో జలగం వెంకట్రావు వర్గీయులు మండల కేంద్రంలో సోమవారం సంబురాలు నిర్వహించారు. చింతలపూడి జగన్, బొడ్డు కేశవరావు, నర్రా అజయ్, రామరాజు, ఉబ్బనపల్లి మణికంఠ, లావుడ్యా గోపి, మండె చంటి, భద్రు పాల్గొన్నారు.

పాల్వంచ మండలంలో..

పాల్వంచరూరల్: వనమాపై అనర్హత వేటు వేస్తూ హైకోర్టు తీర్పు ఇవ్వడంతో మంగళవారం మండలంలోని నాగారం గ్రామంలో జలగం వర్గీయులు సంబురాలు జరుపుకున్నారు.

దమ్మపేటలో..

దమ్మపేట: హైకోర్టు తీర్పు నేపథ్యంలో జలగం వెంకట్రావు వర్గీయులు మండల కేంద్రంలో సంబురాలు జరుపుకున్నారు. చిన్నశెట్టి సత్యనారాయణ, చీకటి మురళి, పాకనాటి శ్రీను, రామకృష్ణ, శశిధర్, చారి, రాంబాబు పాల్గొన్నారు.

అనర్హత వేటు మంచి గుణపాఠం

కొత్తగూడెంరూరల్: వనమా వెంకటేశ్వరరావుపై అనర్హత వేటు మంచి గుణపాఠమని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ శంకర్‌నాయక్ అన్నారు. బస్టాండ్ సెంటర్‌లోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ గుర్తుతో గెలిచి బీఆర్‌ఎస్‌లోకి వెళ్లినందుకు తగిన బుద్ధి చెప్పినట్లయిందన్నారు. సమావేశంలో బొమ్మిడి మల్లికార్జున్, సకినాల వెంకటేశ్వరరావు, అంతోటి పాల్, పల్లపు వెంకటేశ్వర్లు, సిరంగి శ్రీనివాసరావు, రమేశ్, లక్ష్మణ్, సత్యనారాయణ, అక్బర్, రాంమూర్తి, సురేశ్, నాగభూషణం, కుమార్, నరేశ్, రాజు, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

సుప్రీం కోర్టులో అప్పీల్‌కు వెళ్తాం..

పాల్వంచ: కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ఎన్నిక చెల్లదంటూ మంగళవారం హైకోర్టు తీర్పు నిచ్చినట్లు మీడియాలో వార్తలు రావడంతో పెద్ద ఎత్తున ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాత పాల్వంచలోని వనమా స్వగృహానికి చేరుకున్నారు. ఎమ్మెల్యే వనమా హైదరాబాద్‌లోనే ఉండగా అక్కడే కేసుకు సంబంధించి న్యాయ పోరాటానికి సిద్ధమవుతున్నట్లు తెలిసింది. జలగం సైతం కేసీఆర్‌ను కలిసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా భారీ ఎత్తున పార్టీ శ్రేణులు వనమా ఇంటికి చేరుకుని జరుగుతున్న పరిణామాలపై చర్చించారు. ఈ సందర్భంగా డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు మాట్లాడుతూ.. వనమాపై ఉన్న ఆదరణ చెక్కుచెదరదని, ప్రత్యక్షంగా ఎదుర్కోలేక ఇలా చేస్తున్నారన్నారు. సుప్రీం కోర్టుకు అప్పీల్‌కు వెళ్తామని చెప్పారు. కార్యక్రమంలో వనమా రాఘవేంద్రరావు, కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, కంచర్ల చంద్రశేఖర్‌రావు, రాజుగౌడ్, శ్రీరాంమూర్తి, కొట్టి వెంకటేశ్వర్లు, ప్రవీణ్ పాల్గొన్నారు.

పెదవాగు ప్రాజెక్ట్‌లోకి పోటెత్తుతున్న వరద


పెదవాగు ప్రాజెక్టులోకి చేరిన వరదనీరు


కిన్నెరసానిలో నీటిమట్టం సూచిక

అశ్వారావుపేటరూరల్: మండలంలోని గుమ్మడవల్లి వద్దగల పెదవాగు ప్రాజెక్టులోకి వరదనీరు పొటెత్తుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 21 అడుగులు కాగా, ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో మంగళవారం సాయంత్రానికి నీటిమట్టం 13 అడుగులకు చేరింది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లోని కొండవాగు, చిన్నవాగు నుంచి సుమారు 500 క్యూసెక్కుల వరదనీరు వస్తోందని, బుధవారం ఉదయానికి నీటిమట్టం మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు నీటి పారుదల శాఖ ఏఈ కేఎస్‌బీ కృష్ణ తెలిపారు.

కిన్నెరసానిలోకి కొనసాగుతున్న వరద

పాల్వంచరూరల్: మండలంలోని 407 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన కిన్నెరసాని రిజర్వాయర్‌లోకి ఎగువన కురిసిన వర్షానికి 1,111 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. దీంతో నీటిమట్టం మంగళవారం నాటికి 402.20 అడుగులకు పెరగడంతో రెండు గేట్లను ఎత్తి 8 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలామని డ్యామ్ సైడ్ పర్యవేక్షక ఇంజనీర్ సురేశ్ తెలిపారు.

భద్రాచలం వాసికి అవార్డు



అవార్డు అందుకుంటున్న అనిల్‌రెడ్డి

భద్రాచలంటౌన్: ఔషధ మొక్కల పెంపకం, వాటి గుణాలు, రోగుల జబ్బుల లక్షణాలు, సంప్రదాయక వైద్యంపై ప్రత్యేక కథనాలు అందించడంతో పాటు అవగాహన కల్పించినందుకు భద్రాద్రివాసికి అవార్డు లభించింది. న్యూఢిల్లీలోని డాక్టర్ అంబేడ్కర్ అంతర్జాతీయ కేంద్రంలో 'థర్డ్ వరల్డ్ కాంగ్రెస్ ఆన్ నేషనల్ ట్రెడిషనల్ మెడిసిన్' మహాసభలు నిర్వహించారు. అందులో భద్రాచలం పట్టణానికి చెందిన కర్ర అనిల్‌రెడ్డికి మంగళవారం హోలిస్టిక్ రీసెర్చ్ ఫౌండేషన్ కోవిడ్ పురస్కారాన్ని నేపాల్‌కు చెందిన డాక్టర్ రామ్‌ఆధార్‌యాదవ్ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా అనిల్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచ దేశాల నుంచి 600 మంది సంప్రదాయ వైద్యులు హాజరైన ఈ మహాసభల్లో అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందన్నారు.

భారీ వృక్షం నేలమట్టం


నెల్లిపాకలో రహదారిపై కూలిన వృక్షం

అశ్వాపురం: వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండల పరిధిలోని నెల్లిపాక గ్రామంలో మొండికుంట – సారపాక రహదారిపై మంగళవారం భారీ వృక్షం (చింత) నేలకూలింది. దీంతో రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి. స్పందించిన ఆర్‌అండ్‌బీ అధికారులు వృక్షాన్ని తొలగించారు. ఈ చింతచెట్టు 100 ఏళ్ల కిందటి నుంచి ఉందని స్థానిక వృద్ధులు తెలిపారు. 1953లో గోదావరి వరదలు వచ్చినప్పుడు గ్రామస్తులు ఈ చెట్టు ఎక్కి ప్రాణాలు రక్షించుకున్నారని చెబుతున్నారు.

టేకులపల్లిలో..

టేకులపల్లి: ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా మంగళవారం తొమ్మిదోమైలుతండా దాటిన తరువాత అటవీ ప్రాంతంలోని ప్రధాన రహదారిపై భారీ వృక్షాలు విరిగి పడ్డాయి. ఇల్లెందు – కొత్తగూడెం రహదారిలో మూడు గంటల వరకు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. టేకులపల్లి ఎస్‌ఐ రమణారెడ్డి, ఏఎస్‌ఐ కృష్ణతో పాటు పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి స్థానికుల సహకారంతో చెట్లు తొలగించారు.


తొమ్మిదోమైలుతండా సమీపంలో నిలిచిన రాకపోకలు

రక్షణకే తొలి ప్రాధాన్యమివ్వాలి

డీవైడీజీఎంఎస్ భూషణ్ ప్రసాద్ సింగ్


సమావేశంలో పాల్గొన్న అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): గనిలో రక్షణే ముఖ్యమని, దానికే తొలి ప్రాధాన్యమివ్వాలని డీవైడీజీఎంఎస్ భూషణ్ ప్రసాద్‌సింగ్ అన్నారు. కొత్తగూడెం ఏరియా పరిధిలోని ఆర్‌సీఓఏ క్లబ్‌లో మంగళవార ఏరియాస్థాయి త్రైపాక్షిక రక్షణ సమావేశం ఏరియా జీఎం శాలేంరాజు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై ప్రసంగించారు. గనుల్లో పూర్తిస్థాయిలో రక్షణ చర్యలు చేపట్టిన తర్వాతనే ఉత్పత్తి ప్రారంభించాలని సూచించారు. ఈ సందర్భంగా గని ప్రమాదాల్లో మృతిచెందినవారికి నివాళులర్పించారు. రక్షణ ప్రతిజ్ఞ చేశారు. గత సమావేశంలో ప్రతిపాదించిన తీర్మానాలపై సమీక్షించారు. రక్షణ చర్యలు, ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో ఉమేశ్‌ఎం.సావర్కర్, ఎస్.ఆనంద్‌వాల్, ఎస్‌జీ బైసారే, డాక్టర్ జార్జ్‌సన్, కమలేశ్‌కుమార్‌వర్మ, పి.సనత్‌కుమార్, దిలీప్‌కుమార్, రాజీవ్‌హోం‌ప్రకాశ్‌వర్మ, గౌరవ్ లద్దా, జి.వెంకటేశ్వరరెడ్డి, గురవయ్య, కుమారస్వామి, సామ్యుల్ సుధాకర్, రజాక్, రాములు, ఆల్బర్ట్, శ్రీనివాస్, ఆంజనేయులు, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో పోస్ట్‌మాస్టర్ మృతి


రాజేశ్‌కుమార్ (ఫైల్)

టేకులపల్లి: మండలంలోని బద్దు తండా అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ గోవింద్ రాజేశ్‌కుమార్ (32) మృతి చెందాడు. అనారోగ్యంతో బాధ పడుతున్న ఆయన మంగళవారం కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి తల్లి ఉపేంద్ర, తమ్ముడు, చెల్లి ఉన్నారు.

చికిత్స పొందుతున్న లారీడ్రైవర్...

అశ్వారావుపేటరూరల్: ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లారీడ్రైవర్ మంగళవారం మృతి చెందాడు. హెడ్‌కానిస్టేబుల్ మల్లయ్య కథనం ప్రకారం.. వరంగల్ నుంచి ఏపీలోని రాజమండ్రి రైల్వేస్టేషన్‌కు సంబంధించిన సామగ్రితో వెళ్తున్న లారీ మండలంలోని అచ్యుతాపురం వద్ద ఈ నెల 22వ తేదీ అర్ధరాత్రి సమయంలో అదుపుతప్పి బోల్తా పడింది. లారీడ్రైవర్ కులదీప్‌సింగ్(24)కు తీవ్ర గాయాలు కాగా, స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి అన్న సందీప్ కుమార్‌సింగ్ ఫిర్యాదు మేరకు మంగళవారం రాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు. మృతుడిది మధ్యప్రదేశ్ రాష్ట్రం రీయా జిల్లా జావా తాలూకా, బాస్నేహి గ్రామం అని పోలీసులు చెప్పారు.

ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొని ఒకరు..


మనోజ్ (ఫైల్)

అశ్వారావుపేటరూరల్: ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ద్విచక్రవాహనం ఢీకొని ఒకరు మృతిచెందిన ఘటన మంగళవారం రాత్రి మండలంలో చోటుచేసుకుంది. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని దబ్బతోగు గ్రామానికి చెందిన సోయం మనోజ్ (30), ఇతడి మామయ్య మడకం దూలయ్య కలిసి ద్విచక్రవాహనంపై వినాయకపురం వెళ్లారు. తిరిగి తమ స్వగ్రామానికి వస్తుండగా, వినాయకపురం – దబ్బతోగు మార్గ మధ్యలో ఆగి ఉన్న ఓ ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా, స్థానికులు అంబులెన్స్‌లో అశ్వారావుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మనోజ్ అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దూలయ్యను మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ముగ్గురు సంతానం ఉన్నారు. స్థానిక పోలీసులు వివరాలు సేకరించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

బూర్గంపాడు: లక్ష్మీపురం గ్రామంలో పట్టపగలే దొంగలు హల్‌చల్ చేశారు. గ్రామానికి సమీపంలోని ఓ ప్రైవేట్ ఫ్యాక్టరీలో పనులకు వెళ్లి వస్తున్న మైనేని రాణి మెడలోని గోల్డ్‌చైన్‌ను బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు లాక్కెళ్లారు. ఫ్యాక్టరీ డ్యూటీ ముగించుకుని నడుచుకుంటూ లక్ష్మీపురానికి వస్తున్న రాణి మెడలోని గోల్డ్‌చైన్‌ను బైక్‌పై వచ్చిన ఇద్దరు యువకులు బలవంతంగా లాక్కెళ్లారు. ఆమె కేకలు వేస్తున్నా అటుగా ఎవరూ రాకపోవటంతో దుండగులు పరారయ్యారు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

గంజాయి స్వాధీనం : ఇద్దరు అరెస్ట్


పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

జూలూరుపాడు: కారులో అక్రమంగా తరలిస్తున్న రూ.5.20 లక్షల విలువైన 28 కేజీల గంజాయిని స్థానిక పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం సీఐ శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు. మహారాష్ట్ర నుంచి హైదరాబాద్‌కు కారులో గంజాయిని తరలిస్తున్నారనే సమాచారాన్ని కొత్తగూడెం టాస్క్‌ఫోర్స్ సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ గణేశ్ స్థానిక పోలీసులకు చెప్పడంతో వీరు వాహనాల తనిఖీ చేపట్టారు. అనుమానాస్పదంగా ఉన్న కారును ఆపి తనిఖీ చేయగా సుమారు 28 కేజీల గంజాయి లభించిందని, దీని విలువ రూ.5.20 లక్షలు ఉంటుందని సీఐ చెప్పారు. మహారాష్ట్ర బేండికి చెందిన మహిళ హబీబాఖాన్ తన కారులో గంజాయిని మహారాష్ట్ర నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. కారు డ్రైవర్ పల్లకొండ రమేశ్ ఉమ్మడి వరంగల్ జిల్లా చాపలబండ వాసి అని తెలిపారు. ఇద్దరినీ అరెస్ట్ చేసి, కేసు నమోదు చేశామని సీఐ శ్రీనివాస్ వివరించారు. ఎస్‌ఐ పురుషోత్తం పాల్గొన్నారు.

అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

పాల్వంచరూరల్ : జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో హిందీ, కామర్స్ సబ్జెక్టులు బోధించేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి ఈనెల 28 వరకు దరఖాస్తు చేసుకోవాలని గురుకుల విద్యాసంస్థల రీజినల్ కో ఆర్డినేటర్ ప్రత్యూష మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాల్వంచలో కొనసాగుతున్న మణుగూరు గురుకుల కళాశాలలో కామర్స్, దమ్మపేట గురుకుల కళాశాలలో హిందీ అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈనెల 28న లక్ష్మీదేవిపల్లి గురుకుల బాలుర కళాశాలలో నిర్వహించే డెమో క్లాసులకు నేరుగా హాజరు కావాలని సూచించారు. బీఈడీతో పాటు సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ ఉత్తీర్ణులైన పురుష అభ్యర్థులు మాత్రమే అర్హులని తెలిపారు.

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి


అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న ఏపీఓ, డీఎంహెచ్‌ఓ

ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్

భద్రాచలం: ఏఎన్‌ఎంలుగా నియమితులైన వారు విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ అంకితభావంతో విధులు నిర్వర్తించాలని ఐటీడీఏ ఏపీఓ జనరల్, ఇన్‌చార్జ్ ఆర్‌సీఓ డేవిడ్‌రాజ్ సూచించారు. ఔట్‌సోర్సింగ్ పద్ధతిన ఆశ్రమ పాఠశాలలో పనిచేసేందుకు ఏఎన్‌ఎం పోస్టులకు దరఖాస్తు చేస్తున్న అభ్యర్థుల సర్టిఫికెట్లను స్థానిక పీఎంఆర్‌సీ భవనంలో మంగళవారం డీఎంహెచ్‌ఓ శిరీష, ఇతర అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 85 పోస్టులకు 110 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని, సర్టిఫికెట్లను పరిశీలించి మెరిట్ ప్రకారం ఎంపిక చేశామని చెప్పారు. గతంలో పనిచేసిన వారికి తగిన ప్రాముఖ్యత ఇచ్చామని తెలిపారు. ఎంపికైన వారిని కౌన్సెలింగ్ ప్రకారం ఆశ్రమ పాఠశాల, వసతి గృహాలు, పీఎంహెచ్ హాస్టళ్లలో నియమిస్తామని వివరించారు. కార్యక్రమంలో ఏసీఎంఓ రమణయ్య, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రాజ్‌కుమార్, కృష్ణసాగర్ ప్రిన్సిపాల్ హరిసింగ్ నాయక్, ఏటీడీఓలు నర్సింహారావు, చంద్రమోహన్, ఏఎన్‌ఎం శిక్షణ ప్రిన్సిపాల్ అనురాధ, దేవదాసు గామయ్య, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

డీఎంహెచ్‌ఓ శిరీష

అశ్వాపురం/భద్రాచలంటౌన్: సీజనల్ వ్యాధులపై ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ శిరీష అన్నారు. అశ్వాపురంలోని పీహెచ్‌సీని, భద్రాచలంలోని హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామాలల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని, సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. పీహెచ్‌సీల్లో అన్ని మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రజలు అనారోగ్య సమస్యలు వచ్చిన వెంటనే సమీపంలోని ఆరోగ్య కార్యకర్తలను సంప్రదించాలని చెప్పారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో డాక్టర్ చైతన్య, ఇమ్రాన్, అశ్వాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి సంకీర్తన పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

అశ్వాపురం: మండలంలోని మిట్టగూడెం గ్రామ పంచాయతీలోని పాయం మంగయ్యగుంపు గ్రామానికి చెందిన తెల్లం బాబూరావు (36) మంగళవారం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ కలహాల నేపథ్యంలోనే అతడు ఉరివేసుకున్నాడని బంధువులు తెలిపారు. ఎస్‌ఐ సురేశ్ ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు ఆరా తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మణుగూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ సురేశ్ వివరించారు.

మనస్తాపంతో యువకుడు..


దినేశ్ దుర్గాప్రసాద్ (ఫైల్)

ములకలపల్లి: ఉరి వేసుకొని యువకుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. వేముకుంట గ్రామానికి చెందిన నూనె దినేశ్‌దుర్గాప్రసాద్ (35) తల్లిదండ్రులు, సోదరులతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. దినేశ్‌దుర్గాప్రసాద్‌కు ఐదేళ్ల కిందట సరోజతో వివాహం జరుగగా, ఇద్దరు సంతానం. వ్యవసాయం చేసి జీవనం సాగించే దినేశ్‌దుర్గాప్రసాద్‌కు కుటుంబ పోషణ కష్టంగా మారడంతో వేరే పని పని చేసుకుందామని భార్య చెబుతుండేది. సోమవారం రాత్రి దంపతుల మధ్య వాగ్వాదం జరిగింది. మనస్తాపానికిగురైన దినేశ్‌దుర్గాప్రసాద్ మంగళవారం పశువుల కొట్టంతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని తండ్రి వెంకటరంగారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ తిరుమల్‌రావు తెలిపారు.

యువకుడి దారుణ హత్య


నాగేంద్రబాబు (ఫైల్)

చర్ల: మండల కేంద్రంలోని అంబేద్కర్‌నగర్‌లో ఓ యువకుడిని మరో యువకుడు రోకలిబండతో మోది దారుణంగా హత్య చేశాడు. సీఐ అశోక్ కథనం ప్రకారం.. అంబేడ్కర్‌నగర్‌కు చెందిన చిప్పనపల్లి నాగేంద్రబాబుకు, అదే కాలనీకి చెందిన కనుకు సతీశ్‌కు మధ్య సోమవారం మధ్యాహ్నం ఓ ఫంక్షన్‌లో వాగ్వాదం జరిగింది. ఇది మనసులో పెట్టుకున్న కనుకు సతీశ్ సోమవారం అర్ధరాత్రి నాగేంద్రబాబు ఇంటికి వెళ్లి రోకలిబండతో బలంగా కొట్టాడు. తల్లిదండ్రులు క్షతగాత్రుడిని స్థానిక వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స అనంతరం భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలించగా అక్కడ పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నాగేంద్రబాబు మంగళవారం మృతి చెందాడు. మృతుడికి భార్య అంజలి ఉంది. మృతుడి బంధువు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా...


రాష్ట్రపతితో జయధీర్ తిరుమలరావు

రాష్ట్రపతి భవన్‌లో ఆదివాసీ కళా ప్రదర్శన

ద్రౌపదీముర్ము బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా నిర్వహణ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రపతిగా ద్రౌపదీ ముర్ము బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా భారత ప్రభుత్వం సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో మంగళవారం పాత తివాచీల మ్యూజియంలో సూత్ర కళాదర్పణ్, జనజాతి దర్పణ్ పేర్లతో ఆదివాసీ కళాప్రదర్శన నిర్వహించింది. ఈ ప్రదర్శనలో ఆదివాసీ స్వాతంత్ర్య ఉద్యమ వీరుల చిత్రపటాలు, వ్యవసాయ పరికరాలు, లోహ కళాఖండాలను, ఆదివాసీ జీవిత ఛాయాచిత్రాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో రాష్ట్రపతితో పాటు ఇందిరాగాంధీ రాష్ట్రీయ కళాకేంద్రం మెంబర్ కార్యదర్శి సచ్చిదానం జోషి, హైదరాబాద్ ఆద్యకళా మ్యూజియం డైరెక్టర్ జయధీర్ తిరుమలరావు, జానపద సంపద విభాగం అధిపతి కె.అనిల్‌కుమార్, అరుణ్ కుమార్‌రెడ్డి, సతీశ్‌లాల్ తదితరులు పాల్గొన్నారు. ప్రదర్శనలోని కళాఖండాలను తిలకించి ఇలాంటి అతిపెద్ద మ్యూజియం ఏర్పాటుకు ఇది తొలి అడుగు అని పలువురు అభిప్రాయపడ్డారు. ఇందులో సగానికి పైగా కళా ఖండాలను ప్రదర్శించిన హైదరాబాద్ ఆద్యకళా మ్యూజియం వారిని రాష్ట్రపతి అభినందించారు.

మైహోం సిమెంట్ పరిశ్రమలో ప్రమాదం

మేళ్లచెరువు: సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండల కేంద్రం పరిధిలోని మైహోం సిమెంట్ పరిశ్రమలో మంగళవారం జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మైహోం సిమెంట్ పరిశ్రమలో 4వ ప్లాంట్ నిర్మాణ పనులు సాగుతున్నాయి. అందులో నాల్గవ అంతస్తు స్లాబ్ పనులు చేస్తుండగా దాని కింద నుంచి రెడిమిక్స్‌ను బ్లోయర్ ద్వారా పై అంతస్తులకు చేరవేస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం సమయంలో రెడిమిక్స్ పైకి పంపిస్తుండగా జామ్ కావడంతో ఆ నలుగురు కార్మికులు పైపులను సరిచేస్తుండగా ఒక్కసారిగా 40 మీటర్ల ఎత్తులో పైపులు విరిగి పోవడంతో వారు కింద పడిపోయారు. వారిలో మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అరవింద్ సింగ్ (32) మృతిచెందగా.. రాజాసింగ్‌కు తీవ్ర గాయాలయ్యాయి.

దారుణంగా దర్యాప్తు

వివేకా హత్య కేసులో కల్పిత కథనాలతో డైలీ సీరియల్‌లా సీబీఐ ఛార్జ్ షీట్: సజ్జల

సాక్షి, అమరావతి: సీబీఐ లాంటి ప్రతిష్టాత్మక సంస్థ కూడా చెత్తగా దర్యాప్తు చేస్తుండనేందుకు మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు నిదర్శనంగా నిలుస్తోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. ప్రజాక్షేత్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కోలేని గుంట నక్కలకు సీబీఐ వేదికగా మారిందని మండిపడ్డారు. మంగళవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇటీవల సీబీఐ దాఖలు చేసిన సప్లిమెంటరీ ఛార్జ్‌షీట్ మొత్తం కల్పిత కథేనని కొట్టిపారేశారు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుకు బాకాలు ఊదే ఎల్లో మీడియాకు నాలుగు రోజులు మసాలా కథనాలు వండివార్చడానికి మాత్రమే సీబీఐ ఛార్జ్‌షీట్ ఉపయోగపడుతుంది కానీ ఈ డైలీ సీరియల్ న్యాయస్థానాల్లో నిలబడదని తేల్చి చెప్పారు. వైఎస్ భారతమ్మ, తాను కలిసి సునీతమ్మ ఇంటికే వెళ్లలేదని సజ్జల స్పష్టం చేశారు. అలాంటప్పుడు ఎంపీ అవినాశ్‌రెడ్డిని వెనకేసుకురావాలని సునీతమ్మను తాను ఎలా కోరుతానని ప్రశ్నించారు. సునీతమ్మ పచ్చి అబద్ధాలు చెబుతున్నట్లు స్పష్టమవుతోందన్నారు. సజ్జల ఇంకా ఏమన్నారంటే..



ఆ మాత్రం ఇంగిత జ్ఞానం లేదా?

ఎలాంటి ఆధారాలు లేకున్నా కేవలం వ్యక్తుల వాంగ్మూలాలను కల్పిత కథకు అనుకూలంగా మారుస్తూ సీబీఐ ఛార్జ్‌షీట్లు దాఖలు చేస్తోంది. వైఎస్ వివేకా హత్య వల్ల నష్టం ఎవరికి? అని ప్రశ్నిస్తే.. వైఎస్సార్ సీపీకి, జగన్‌కే అని చిన్న పిల్లాడైనా చెబుతాడు. ఇంకా చెప్పాలంటే నాడు కడప ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న అవినాశ్‌రెడ్డికి నష్టం. రాజకీయంగా ఆత్మహత్య చేసుకోవాలని ఆయన ఎందుకు అనుకుంటారు? ఏ చిన్న దర్యాప్తు సంస్థ అయినా, ప్రైవేట్ డిటెక్టివ్ సంస్థకైనా ఈమాత్రం ఇంగితం ఉంటుంది. వివేకా హత్య కేసును రెండు సిట్‌లు దర్యాప్తు చేశాయి. అవి సేకరించిన కాల్ రికార్డ్స్, డేటాను సీబీఐ ఏం చేసిందో తెలియదు.

వ్యవస్థల్లోకి వైరస్‌లా చంద్రబాబు..

అన్ని వ్యవస్థల్లో వైరస్‌లా పాకిన చంద్రబాబు తన అనుచరులతో జాతీయ స్థాయిలో మేనేజ్ చేసేలా చక్రం తిప్పుతున్నారు. వివేకా హత్య వల్ల నాడు అధికారంలో ఉన్న చంద్రబాబుకు రెండు లాభాలు. ఒకటి వైఎస్ జగన్ ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయడం.. రెండోది.. పాదయాత్ర పూర్తిచేసి అభ్యర్థులను ప్రకటించేందుకు సిద్ధమైన వైఎస్ జగన్‌ను తేరుకోనివ్వకుండా చేయడం.

ప్రత్యర్థుల క్యాంపులో సునీతమ్మ..:

కారణాలు ఏమిటో తెలియదుగానీ వివేకా కుమార్తె సునీతమ్మ ఆ తర్వాత వ్యవహరిస్తున్న తీరు చూస్తుంటే ఆమె పూర్తిగా ప్రత్యర్థుల క్యాంపులోకి వెళ్లినట్లు అనిపించింది. కథ మలుపు తిరగాలన్నప్పుడల్లా వారికి అనుగుణంగా ఆరేడు సార్లు సునీతమ్మ స్టేట్‌మెంట్లు తీసుకున్నారు. వారికి కావాల్సిన స్టేట్‌మెంట్లు తీసుకుంటూ ఇన్వెస్టిగేషన్ రివీల్డ్ అంటున్నారు. సునీల్ యాదవ్ అనే నిందితుడు బెయిల్‌కి దరఖాస్తు చేసినప్పుడు గూగుల్ టేకవుట్‌ను తెరపైకి తెచ్చి అవినాశ్‌రెడ్డి తండ్రిని లోపల పెట్టేశారు. గూగుల్ టేకవుట్ ఈ కేసులో నిలబడదని తెలియగానే యూనివర్సల్ టైమ్ కో–ఆర్డినేటర్ ప్రకారం మన సమయానికి 5.30 గంటలు కలపాలన్నారు. ఆ లెక్కన వారు చెప్పిన టైం మరుసటి రోజు 8 గంటలు కావడంతో దాన్ని పక్కన పెట్టేశారు. అది నిలబడదని వారికీ అర్థమైంది.

తెలంగాణ హైకోర్టు ప్రశ్నించడంతో..

తెలంగాణ హైకోర్టు గత మే 31న మొదటిసారిగా కేసును క్షుణ్ణంగా పరిశీలించి సీబీఐని పలు ప్రశ్నలు అడిగింది. మేం ముందు నుంచీ వ్యక్తం చేస్తున్న సందేహాలే అవి. అవినాశ్‌రెడ్డి జూన్ 19న సీబీఐ డైరెక్టర్‌కి లేఖ రాయడంతో సునీతమ్మ స్టేట్‌మెంట్ మరొకటి రికార్డు చేశారు. హింసాత్మక సంఘటనలు జరుగుతాయనే లేఖను బయట పెట్టలేదని సునీతమ్మ చెబుతున్నారు. అది అసహజం. సొంత తండ్రి చనిపోయినా లేఖ విషయాన్ని పట్టించుకోలేదంటే ఎలా నమ్మడం?

పది రోజుల తర్వాత పరామర్శకు వెళ్లా..

2019 మార్చి 23వ తేదీన భారతమ్మ వచ్చి సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పినట్లు చేయమన్నారని సునీతమ్మ స్టేట్‌మెంట్‌లో పేర్కొన్నారు. అవినాశ్‌ను సమర్థించాలని నేను కోరినట్లు కథ అల్లారు. ఆ రోజు భారతమ్మ, నేను కలిసి ఆమె ఇంటికి వెళ్లలేదు. వివేకా హత్య జరిగిన తర్వాత పది రోజులకు నా భార్యతో కలసి పరామర్శించడానికి వెళ్లా. బాగా షాక్‌తో ఉంటారనుకున్నాగానీ అంత ఇదిగా అయితే కనిపించలేదు. షాకింగ్ సంఘటన జరిగినప్పుడు మొదట ఇంటికి పెద్దలా ఉన్న వైఎస్ జగన్‌కు ఫోన్ రావాలి. కానీ సునీతమ్మ వైపు నుంచి ఫోన్ రాలేదు. వివేకా వ్యక్తిత్వాన్ని హననం చేసిన ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ, ఈనాడు ఈరోజు ఆమెకు మిత్రులు, సలహాదారులు, సన్నిహితులు. వివేకాకు మచ్చ రాకూడదని అవినాశ్‌రెడ్డి కుటుంబం మూడేళ్ల మౌనంగా అన్నీ భరించింది. చనిపోయిన వ్యక్తి గౌరవాన్ని కాపాడాలని మేం తపన పడుతుంటే బతికున్నవారినే సునీతమ్మ బజారుకీడుస్తున్నారు. బతుకులను నాశనం చేసే పరిస్థితికి వచ్చాక మౌనం వీడి నోరు తెరవాల్సి వస్తోంది.

> **దస్తగిరిని అప్రూవర్‌గా మార్చి ట్రైనింగ్**
>
> ఆధారాలు, పరిసరాలు, హత్యలో పాల్గొన్న వ్యక్తులు ఇలా అన్నీ ఒక వైపు చూపిస్తుంటే.. దర్యాప్తు మరోవైపు సాగుతోంది. ఎప్పుడైతే సునీతమ్మ ఆలోచన విధానం మారిందో అప్పుడే కేసును బలవంతంగా తిప్పడం మొదలుపెట్టారు. చంద్రబాబుకు లాభం చేకూరేలా మార్చారు. వ్యవస్థలను మేనేజ్ చేయడంలో సిద్ధహస్తులు కాబట్టి సీబీఐ చేతికి వచ్చాక వారికి తగ్గట్లుగానే అన్నీ జరుగుతూ వచ్చాయి. అవినాశ్‌రెడ్డి వైపు వేలు చూపించేందుకు దస్తగిరిని అప్రూవర్‌గా మార్చి రెండు మూడు నెలలు ట్రైనింగ్ కూడా ఇచ్చారు.

వివేకా కోసం అవినాష్ ధర్నా

నిజానికి నాడు వివేకాకు ఎమ్మెల్సీ టికెట్ ఇవ్వాలని జగన్‌కు ప్రతిపాదన చేసింది అవినాశే. ఒక ఎంపీటీసీని టీడీపీ నేతలు ఎత్తుకెళితే వివేకా కోసం అవినాశ్‌రెడ్డి స్వయంగా ధర్నాకు కూర్చున్నాడు. 2011లో పార్టీ పెట్టినప్పటి నుంచీ పులివెందుల విషయంలో తన ప్రతినిధిగా అవినాశ్‌ను జగన్ ఎంపిక చేసుకున్నారు. వైఎస్సార్‌కు వివేకా ఎలాగో ఇప్పుడు జగన్‌కు కూడా అవినాష్ అలానే.

గుంట నక్కలకు వేదిక..

వివేకాను వారే హత్య చేశారనేందుకు పది పన్నెండు కారణాలున్నాయి. ఆస్తి, కుటుంబ పరువు విషయాలే ప్రధానంగా హత్యలకు దారి తీస్తాయి. వివేకా చెక్ పవర్‌ను రద్దు చేయడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వివేకా రెండో భార్య షమీమ్ స్టేట్‌మెంట్లో అన్నీ ఉన్నాయి. వివేకా బావమరిది శివప్రకాశ్‌రెడ్డి బెదిరించాడని, మనుషులను పంపించాడని ఆమె స్టేట్‌మెంట్ ఇచ్చింది. దీనిపై సీబీఐ ఎందుకు విచారించదు? అన్ని శక్తులు ఉడిగిపోయిన గుంటనక్కలన్నీ ఒకచోట చేరి సీఎం వైఎస్ జగన్‌ను రాజకీయంగా దెబ్బతీసేందుకు సీబీఐని వేదికగా చేసుకుంటున్నాయి. పది బండలు వేస్తే ఒకటన్నా నమ్మకపోతారా అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే కోర్టు ఒకసారి మొట్టికాయలు వేసింది. న్యాయమూర్తి అమ్ముడుపోయాడంటూ ఆంధ్రజ్యోతి డిబేట్‌లో నేరుగా బురద చల్లే దుస్సాహసానికి ఒడిగట్టింది. జర్నలిజం పేరుతో బెదిరింపులకు పాల్పడుతూ ఉగ్రవాదుల కంటే దారుణంగా వ్యవహరిస్తున్నారు. చంద్రబాబు, ఎల్లో మీడియా కరివేపాకులా సునీతమ్మను వాడుకుంటున్నారు. ఎన్నికలు ముగియగానే ఆమెను అనాథలా పక్కన పెట్టడం ఖాయం.

జస్టిస్ సామ్ కోషి బాధ్యతల స్వీకరణ రేపు

ప్రమాణం చేయించనున్న హైకోర్టు సీజే

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ హైకోర్టుకు న్యాయమూర్తిగా బదిలీ అయిన జస్టిస్ సామ్ కోషి ఈ నెల 27న బాధ్యతలు చేపట్టనున్నారు. గురువారం ఉదయం 10 గంటలకు హైకోర్టు మొదటి హాల్లో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే ఆయనతో ప్రమాణ స్వీకారం చేయిస్తారు. ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్ హైకోర్టులో పనిచేస్తున్న జస్టిస్ సామ్ కోషిని సుప్రీం కోర్టు కొలీజియం తొలుత మధ్యప్రదేశ్‌కు సిఫార్సు చేయగా, వేరే రాష్ట్రానికి బదిలీ చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దీంతో సుప్రీంకోర్టు కొలీజియం ఆయనను తెలంగాణ హైకోర్టుకు సిఫార్సు చేయగా, రాష్ట్రపతి ఆమోదముద్ర వేసిన సంగతి తెలిసిందే.

1991లో న్యాయవాదిగా ఎన్‌రోల్

జస్టిస్ సామ్ కోషి మధ్యప్రదేశ్‌లో 1967, ఏప్రిల్ 30న జన్మించారు. జబల్‌పూర్‌లోని జీఎస్ కళాశాల నుంచి కామర్స్‌లో డిగ్రీ పట్టా పొందారు. రాణి దుర్గావతి విశ్వవిద్యాలయం నుంచి న్యాయ విద్య పూర్తిచేసి 1991, మార్చి 9న న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. రాజ్యాంగం, సివిల్, సర్వీస్, లేబర్ అంశాల్లో ఎక్కువగా కేసులు వాదించారు. 2000 నుంచి 2013 వరకు మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ హైకోర్టుల్లో న్యాయవాదిగా పనిచేశారు. ప్రభుత్వరంగ సంస్థలు, బ్యాంకులు, ప్రైవేట్ సంస్థలు, సౌత్‌ఈస్ట్ సెంట్రల్ రైల్వే, కోల్ ఇండియా లిమిటెడ్, నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎస్‌బీఐ, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, హిందూస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర విద్యుత్ బోర్డులకు కౌన్సిల్‌గా వ్యవహరించారు. 2002 నుంచి 2004 వరకు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వ న్యాయవాదిగా బాధ్యతలు నిర్వహించారు. 2005 నుంచి 2006 వరకు డిప్యూటీ అడ్వొకేట్ జనరల్‌గా పనిచేశారు. 2013, సెప్టెంబర్ 16న ఛత్తీస్‌గఢ్ హైకోర్టు అడిషనల్ జడ్జిగా నియామితులయ్యారు. ప్రస్తుతం తెలంగాణ హైకోర్టుకు బదిలీపై రానున్నారు.

9 మంది ఐఏఎస్‌ల బదిలీ

ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్ శాంతికుమారి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా తొమ్మిది మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన అధికారుల వివరాలు ..

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ
బి.గోపి	సీసీఎల్ఏ సెక్రెటరీ	కలెక్టర్, కరీంనగర్
ఆర్‌వీ కర్ణన్	===	కలెక్టర్, నల్లగొండ
టి.వినయ్‌కృష్ణారెడ్డి	కలెక్టర్, నల్లగొండ	రిపోర్ట్ టు జీఏడీ
వెంకటేశ్ దోత్రే	అడిషనల్ కలెక్టర్, మహబూబ్‌నగర్	అడిషనల్ కమిషనర్, జీహెచ్ఎంసీ
చెక్క ప్రియాంక	అడిషనల్ కలెక్టర్, పెద్దపల్లి	అడిషనల్ కలెక్టర్ (లోకల్‌బాడీస్) సూర్యాపేట
హేమంత కేశవ్ పాటిల్	====	అడిషనల్ కలెక్టర్ (లోకల్‌బాడీస్) ఆసిఫాబాద్
జల్ద అరుణశ్రీ	అడిషనల్ కలెక్టర్, కరీంనగర్	అడిషనల్ కలెక్టర్ (లోకల్‌బాడీస్) పెద్దపల్లి
ప్రఫుల్ దేశాయి	అడిషనల్ కలెక్టర్, జనగాం	అడిషనల్ కలెక్టర్ (లోకల్‌బాడీస్) కరీంనగర్
జి.రమేశ్	స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్, యూఎల్‌సీ,హైదరాబాద్	అడిషనల్ కలెక్టర్ (లోకల్‌బాడీస్) మెదక్

సెల్‌ఫోన్ వాడుతోందని తలపై మోదాడు

అన్న చేతిలో చెల్లెలి మృతి

ఇల్లెందురూరల్: సెల్‌ఫోన్ విషయంలో అన్నాచెల్లెలి మధ్య మొదలైన ఘర్షణ చివరికి చెల్లెలి ప్రాణాలు తీసింది. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు సీఎస్సీ బస్తీ గ్రామపంచాయతీ పరిధి రాజీవ్‌నగర్ తండాలో సోమవారం చోటుచేసుకుంది. ఏఎన్ఎంగా శిక్షణ పొందిన అజ్మీరా సింధు (23)ను సెల్‌ఫోన్ వాడకం తగ్గించాలని ఆమె సోదరుడు హరిలాల్ చెప్పినా వినిపించుకోలేదు. దీంతో సోమవారం సాయంత్రం ఇద్దరి మధ్య గొడవ జరిగింది. మాటామాటా పెరగడంతో కోపోద్రిక్తుడైన హరిలాల్ రోకలిబండతో సింధు తలపై బలంగా కొట్టాడు. దీంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిన సింధును కుటుంబీకులు ఖమ్మం తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆమె తలపై బలమైన గాయం ఉండటం, అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు పత్రికల్లో కథనాలు రావడంతో పోలీసులు మంగళవారం విచారణ చేపట్టగా సోదరుడు కొట్టడమే కారణమని వెల్లడైంది. కాగా, నిందితుడు హరిలాల్ పరారీలో ఉన్నట్లు ఇల్లెందు సీఐ కరుణాకర్ తెలిపారు.

జిల్లా వార్తలు

వచ్చేనెల 4న కార్మిక గర్జన

ఖమ్మంమయూరిసెంటర్: హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్‌లో వచ్చేనెల 4న నిర్వహించనున్న కార్మికగర్జనను జయప్రదం చేయాలని తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.రామయ్య పిలుపునిచ్చారు. ఖమ్మంలోని పలు డివిజన్లలో మంగళవారం ప్రచారం చేసి ఆయన మాట్లాడారు. మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికుల శ్రమతోనే పట్టణాలు పరిశుభ్రంగా ఉంటున్నాయని తెలిపారు. అయినప్పటికీ వారికి కనీస వేతనాల చట్టాన్ని అమలు చేయడం లేదని ఆరోపించారు. రాష్ట్రంలో 65 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తుండగా, తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా రూ.వెయ్యి వేతనం పెంచుతున్నట్లు ప్రకటించినా ఇప్పటికీ ఇవ్వలేదని తెలిపారు. సమస్యల సాధన కోసం ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యాన వచ్చేనెల 4న జరిగే కార్మిక గర్జనకు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కొయ్యల శ్రీనివాస్, దున్న గురవయ్య, జానయ్య, వెంకటనారాయణ, నాగరాజు, మైబుబ్, లాలమ్మ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ రాష్ట్ర, జిల్లా కమిటీలు రద్దు

సత్తుపల్లిటౌన్: తెలంగాణలో క్రిస్టియన్ల సంక్షేమానికి కృషి చేస్తున్న ఎన్‌సీసీ రాష్ట్ర కమిటీతోపాటు అన్ని జిల్లాల కమిటీలను రద్దు చేస్తున్నట్లు నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ జాతీయ సెక్రటరీ జనరల్ సిల్వియ జయదీప్ మంగళవారం ఒక ప్రకటనలో ప్రకటించారు. ఎన్‌సీసీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ శ్యాంపాల్, జాతీయ అధ్యక్షుడు డాక్టర్ స్టీఫెన్ చిట్టిబాబు ఆధ్వర్యాన వచ్చేనెలలో రాష్ట్ర కమిటీని ప్రకటిస్తామని తెలిపారు. కాగా, మణిపూర్‌లో జరుగుతున్న ఘటనలపై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

రోడ్డుప్రమాదంలో ఒకరు మృతి

మృతుడు మహబూబాబాద్ జిల్లా వాసి

కారేపల్లి: ద్విచక్రవాహనాన్ని ఎదురుగా వచ్చిన ఆటో ట్రాలీ అతివేగంగా ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. మండలంలోని ఖమ్మం–ఇల్లెందు ప్రధాన రహదారి ఊట్కూరు స్టేజీ వద్ద మంగళవారం ఈ ప్రమాదం జరిగింది. మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం కిష్టాపురానికి చెందిన సపావత్ శివ (30) ద్విచక్రవాహనంపై కారేపల్లి మండలం గాంధీనగర్ పాఠశాలలో తమ కుమారుడి సర్టిఫికెట్ల విషయమై వస్తున్నాడు. ఇదే క్రమంలో ఎదురుగా వచ్చిన ఆటోట్రాలీ ఊట్కూరు స్టేజీవద్ద ఢీకొట్టింది. ఈ ఘటనలో శివ అక్కడికక్కడే మృతిచెందాడు. ఆయనకు భార్య సునీతతో పాటు ఇద్దరు కుమారులున్నారు. శివ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కారేపల్లి ఎస్ఐ రామారావు తెలిపారు.

విద్యుత్ ఉత్పత్తికి బ్రేక్

- వినియోగం తగ్గడంతో కేటీపీఎస్‌లో 'బ్యాక్ డౌన్'
- ఉత్పత్తి సామర్థ్యం తగ్గించిన అధికారులు
- మరో మూడు నెలలు ఇదే పరిస్థితి


పాల్వంచలోని కేటీపీఎస్ కాంప్లెక్స్

పాల్వంచ: రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వాతావరణంలో మార్పులు రాగా.. విద్యుత్ డిమాండ్ గణనీయంగా తగ్గుముఖం పట్టింది. ఈ ప్రభావం విద్యుత్ ఉత్పత్తి యూనిట్లపై పడింది. మరోవైపు అన్ని రిజర్వాయర్లలోకి భారీగా వరద చేరడంతో జల విద్యుత్ ప్రారంభించారు. ఫలితంగా థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఉత్పత్తిని తగ్గించాల్సి వచ్చింది. ఇందులో భాగంగా పాల్వంచలోని కేటీపీఎస్ కర్మాగారాల్లో ఉత్పత్తి సామర్థ్యాన్ని తగ్గించి బ్యాక్‌డౌన్‌లో నడిపిస్తున్నారు. అలాగే, మణుగూరు బీటీపీఎస్‌లో తడి బొగ్గు కారణంగా ఉత్పత్తి తగ్గింది. ఈ పరిస్థితి మరో మూడు నెలలు కొనసాగే అవకాశముందని అధికారులు చెబుతున్నారు.


డిమాండ్‌తో పాటే తగ్గిన ఉత్పత్తి

వర్షాల కారణంగా వాతావరణం చల్లబడడంతో విద్యుత్ డిమాండ్ తగ్గింది. విద్యుత్ అవసరాలు గణనీయంగా పడిపోవడంతో పాటు వ్యవసాయ మోటార్లు సైతం నడవని కారణంగా రాష్ట్ర గ్రిడ్‌పై భారం పడడం లేదు. దీంతో నూతన సాంకేతిక పరిజ్ఞానంతో అవసరం మేరకు మాత్రమే ఉత్పత్తిని తీసుకుంటూ.. ఆటోమేటిక్‌గా యూనిట్లు బ్యాక్‌డౌన్ చేయాలనే సంకేతాలు ఇస్తుంటాయి. దీంతో అక్కడక్కడా యూనిట్లు నడిపిస్తున్నప్పటికీ ఉత్పత్తిని బ్యాక్‌డౌన్‌లోకి తీసుకుంటారు.

కేటీపీఎస్‌లో ఇలా..

పాల్వంచలోని కేటీపీఎస్ 5, 6వ దశల కర్మాగారం 9, 10వ యూనిట్లలో 250 చొప్పున 500 మెగావాట్లకు గాను ఒక్కో యూనిట్‌ను 185 మెగావాట్లతోనే నడిపిస్తున్నారు. ఇక 11వ యూనిట్ 500 మెగావాట్లకు గాను 350 మెగావాట్లను తీసుకుంటున్నారు. ఇదిలా ఉండగా కేటీపీఎస్ 7వ దశ కర్మాగారంలో 800 మెగావాట్ల సామర్థ్యం కాగా, పూర్తిస్థాయి సామర్థ్యంతో నడిపించలేని పరిస్థితి ఎదురవుతోంది. సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో నడిపిస్తున్న ఈ కర్మాగారంలో పూర్తిస్థాయి సామర్థ్యంతో ఉత్పత్తి చేస్తే వైబ్రేషన్స్ ప్రభావం పడుతుండటంతో జెన్‌కో యాజమాన్యం నుంచి ప్రత్యేక అనుమతి తీసుకుని 700 మెగావాట్లకు కుదించి నడిపిస్తున్నట్లు తెలుస్తోంది.

> **తడిసిన బొగ్గు**
>
> వరుసగా వారం రోజుల నుంచి వర్షాలు కురుస్తున్నాయి. దీంతో మణుగూరులోని బీటీపీఎస్‌లో నిల్వ చేసిన బొగ్గు తడిసింది. అలాగే, సింగరేణిలోనూ బొగ్గు ఉత్పత్తి పడిపోయి సరిపడా సరఫరా కావడం లేదు. ఈ కారణంగా బీటీపీఎస్‌లో 270 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాలుగు యూనిట్లలో 1,080మెగావాట్లకు గాను 700 మెగావాట్ల ఉత్పత్తి మాత్రమే నమోదవుతోంది. ఇక్కడ తడి బొగ్గు కారణంగానే ఉత్పత్తి తక్కువగా జరుగుతోందని బీటీపీఎస్ సీఈ బిచ్చన్న తెలిపారు.

> **విద్యుత్ డిమాండ్ తగ్గింది**
>
> 
>
> వర్షాల కారణంగా విద్యుత్ డిమాండ్‌లో హెచ్చుతగ్గులు నమోదవుతున్నాయి. ఈక్రమంలో విద్యుత్ ఉత్పత్తి యూనిట్లు ఫుల్ లోడ్‌లో నడిపిస్తున్నా బ్యాక్‌డౌన్ తీసుకోవాల్సి వస్తోంది. జల విద్యుత్ ఉత్పత్తి పెరగడం, వ్యవసాయ అవసరాలు అంతంగా లేకపోవడంతో విద్యుత్ వినియోగం తగ్గింది.
>
> –ఎం.ప్రభాకర్‌రావు, సీఈ, కేటీపీఎస్ 5, 6 దశలు

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక శ్రద్ధ

భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్


తేగడలోని అంగన్‌వాడీ కేంద్రం పిల్లలతో మాట్లాడుతున్న పీఓ జైన్

చర్ల: భారీ వర్షాలతో వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్న నేపథ్యాన గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉపాధ్యాయులు, అధికారులు శ్రద్ధ వహించాలని భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ప్రతీక్ జైన్ ఆదేశించారు. చర్ల మండలంలో ని పలు ఆశ్రమ పాఠశాలలు, ప్రభుత్వ వైద్యశాల, అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం ఆయన తని ఖీ చేశారు. ముందుగా చర్లలోని ఉంజుపల్లి బాలుర ఆశ్రమ పాఠశాలను సందర్శించిన పీఓ సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశమున్నందున విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని, మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని సూచించారు. కాగా, లైబ్రరీ నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో హెచ్ఎం సాయన్నను పీఓ మందలించారు. ఆ తర్వాత పెదమిడిసిలేరులోని బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించిన ఆయన విద్యార్థులతో కలిసి భోజనం చేశాక హెచ్ఎం చంద్రకళ, ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. అక్కడి నుంచి కొయ్యూరు ప్రభుత్వ వైద్యశాలకు చేరుకుని సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తగిన చర్యలు చేపట్టాలని వైద్యాధికారి శ్రీధర్‌కు తెలిపారు. ఆ తర్వాత తేగడలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన పీఓ గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారంపై ఆరా తీశారు. ఈ తనిఖీల్లో తహసీల్దార్ బి.భరణిబాబు పాల్గొన్నారు.

ముంపు నివారణ చర్యల్లో ప్రభుత్వం విఫలం

- భద్రాద్రిలో స్లూయిజ్‌ల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి
- డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే వీరయ్య, జెడ్పీ చైర్మన్ కనకయ్య


ఇరిగేషన్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీరయ్య, జెడ్పీ చైర్మన్ కనకయ్య

భద్రాచలం: ఏటా గోదావరి వరదలతో ఏజెన్సీ ప్రాంత ప్రజలకు తీరని నష్టం జరుగుతున్నా ముందస్తు చర్యలు చేపట్టడంలో ప్రభుత్వం విఫలమైందని భద్రాద్రి డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే పొదెం వీరయ్య, జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య ఆరోపించారు. భద్రాచలంలో మంగళవారం పర్యటించిన వారు కరకట్ట పైనుంచి గోదావరి వరద ఉధృతిని పరిశీలించి అధికారులతో వివరాలు ఆరా తీశారు. విస్తా కాంప్లెక్స్ వద్ద ఉన్న స్లూయిజ్‌ల నుంచి మురుగునీటిని గోదావరి నదిలోకి తరలిస్తున్న తీరును పరిశీలించారు. అనంతరం నన్నపనేని మోహన్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస శిబిరానికి వెళ్లి బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీరయ్య, జెడ్పీ చైర్మన్ కనకయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి భద్రాచలం ఏజెన్సీలో సమస్యల పరిష్కారంపై చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. గత ఏడాది ముంపు బాధితులను పరామర్శించిన సీఎం కేసీఆర్ వెయ్యి కోట్ల నిధులు ఇస్తామని ప్రకటించిన హామీ నెరవేరలేదని చెప్పారు. ఇకనైనా ఏజెన్సీలో ముందస్తు చర్యలు చేపట్టాలని, కరకట్ట, స్లూయిజ్‌ల లీకేజీ నివారణకు నిధులను విడుదల చేయాలని, శాశ్వత పునరావాస కేంద్రాలు, ముంపు ప్రజలందరికీ ఇళ్ల నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమాల్లో నాయకులు డాక్టర్ తెల్లం వెంకట్రావు, సరెళ్ల నరేశ్, చింతిరేల రవికుమార్, భోగాల శ్రీనివాసరెడ్డి, బంధం శ్రీనివాస్‌గౌడ్, నవాబ్, ఎడారి ప్రదీప్, చింతిరేల సుధీర్, సరెళ్ల వెంకటేశ్, రాసమళ్ల రాము, పందాల సరిత తదితరులు పాల్గొన్నారు.

పాలకుల కుట్రకు బలైన విద్యారంగం

పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణ, ఆజాద్



సమావేశంలో పాల్గొన్న రామకృష్ణ, ఆజాద్, నాయకులు

ఇల్లెందు: రాష్ట్రంలో కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందిస్తామని ఇచ్చిన హామీని పాలకులు విస్మరించడంతో విద్యారంగం బలైందని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి.రామకృష్ణ ఎస్.ఆజాద్ పేర్కొన్నారు. పీడీఎస్‌యూ రాష్ట్ర విద్యా, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణ తరగతులు ఆగస్టు 12 నుంచి 14వ తేదీ వరకు ఇల్లెందులోని ఎల్లన్న విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా ఇల్లెందులో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలోని పాఠశాలల్లో వసతుల లేమి, ఉపాధ్యాయుల కొరత కారణంగా విద్యారంగం కుంటుపడుతోందని చెప్పారు. మన ఊరు – మన బడి కార్యక్రమంతో ప్రచార ఆర్భాటం తప్ప ఎలాంటి ప్రయోజనం లేదని ఆరోపించారు. ప్రైవేట్ యాజమాన్యాలు, కార్పొరేట్ సంస్థలతో మిలాఖత్ అయిన ప్రభుత్వ పెద్దలు విద్యారంగాన్ని నిర్వీర్యం చేశారని తెలిపారు. కాగా, ఇల్లెందులో జరిగే రాజకీయ శిక్షణ తరగతుల్లో ఐక్య విద్యార్థి ఉద్యమాలకు ప్రణాళిక రూపొందిస్తామని రామకృష్ణ, ఆజాద్ వెల్లడించారు. పీడీఎస్‌యూ భద్రాద్రి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.సంధ్య, కాంపాటి పృథ్వీతో పాటు రంగవల్లి, గణేశ్, సాయి, వంశీవర్ధన్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీని లాభాల బాటలోకి తీసుకొద్దాం


డ్రైవర్ల శిక్షణలో మాట్లాడుతున్న ఆర్ఎం వెంకన్న

ఖమ్మంమామిళ్లగూడెం: ప్రయాణికులకు మెరుగైన సేవలందిస్తూ ఆర్టీసీని లాభాల బాటలోకి తీసుకొచ్చేందుకు ప్రతీ ఉద్యోగి కృషి చేయాలని ఖమ్మం రీజినల్ మేనేజర్ సీహెచ్.వెంకన్న సూచించారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఖమ్మం కొత్త బస్టాండ్‌లో మంగళవారం ఆర్టీసీ, అద్దె బస్సు డైవర్లకు టాక్ట్ పేరుతో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ సంస్థను నమ్ముకుని బస్సు ఎక్కిన ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాల్సిన బాధ్యత డ్రైవర్లపై ఉందని తెలిపారు. కాగా, రోజుకు 100 మంది చొప్పున రీజియన్‌లోని డ్రైవర్లకు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సీటీఎం బి.ప్రసాద్, ఖమ్మం ఇన్‌చార్జ్ డీఎం దేవదానం, సీఐలు శ్రీనివాస్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.